**వామపక్ష పార్టీల విలేకర్ల సమావేశం - 18 ఆగష్టు, 2020 - విజయవాడ**

## ప్రభుత్వ నిర్లక్ష్యమే నిర్వాసితులను ముంచేసింది
## ముఖ్యమంత్రి తక్షణమే స్పందించాలి

ప్రభుత్వ నిర్లక్ష్యానికి పోలవరం నిర్వాసితులు మరోసారి బలయ్యారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొంగిపోర్లుతున్న గోదావరి నిర్వాసిత గ్రామాలన్నీటినీ ముంచేసింది. విలీన మండలాలు చింతూరు, వి.ఆర్.పురం, కూనవరం, ఎటపాక, దేవీపట్నం మండలంలోని గ్రామాలన్నీ సంపూర్ణంగా నీట మునిగిపోయాయి. ప్రజలంతా ఇళ్లను, సామాగ్రిని వదిలేసి కొండలపైనే తలదాచుకుంటున్న పరిస్థితి. గత రెండున్నర రోజులుగా వీరికి మంచినీరు ఇచ్చే దిక్కూ లేదు. ఆహారం, మందులు లేక ఆదివాసీలంతా నానా అవస్థలు పడుతున్నారు. గత వారం రోజులుగా వరదలు వస్తాయన్న హెచ్చరికలు వచ్చినా ప్రభుత్వం ముంపు బాధితులపట్ల ఎంత నిర్లక్ష్యంగా ఉందో కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. వరద ప్రమాదంపై ప్రభుత్వానికి పట్టకపోవడంతోనే వందల గ్రామాలు ముంపు బారిన పడ్డాయి.

పునరావాసం పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరే పోలవరం నిర్వాసితులను గోదాట్లో ముంచేసింది. పోలవరం పునరావాసం పెద్ద మోసంగా కనిపిస్తోంది. 15 సంవత్సరాల్లో 15 గ్రామాలకు కూడా పునరావాసం కల్పించలేదు. గత టిడిపి ప్రభుత్వం, ఇప్పుడు వైసిపి ప్రభుత్వం రెండూ కాఫర్ డ్యాం, స్పిల్ వే కట్టడం పైన దృష్టి పెట్టి నిర్వాసితులను పూర్తిగా గాలికొదిలేశారు. టిడిపి నిర్లక్ష్యాన్ని సరిచేస్తామన్న జగన్ ప్రభుత్వానికి అధికారంలోకి వచ్చాక నిర్వాసితుల గోడు పట్టలేదు. గత ఏడాది ముంపు బారిన పడ్డ దేవీపట్నం మండలంలోని గ్రామాలకు పునరావాస కాలనీలు నిర్మిస్తామని చెప్పిన ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కనీసం గత వరదల సమయంలో ముంపుకు గురైన ఇళ్లకు ప్రకటించిన తక్షణ సాయాన్ని కూడా ఇప్పటికీ అందజేయని పరిస్థితి. జాతీయ ప్రాజెక్టుగా చెప్పినా కేంద్ర బిజెపి నిర్వాసితుల పునరావాసం కోసం పైసా కూడా విదల్చకుండా చోద్యం చూస్తోంది. అలాగే ముంపు దృష్ట్యా ముందస్తు చర్యలైనా చేపట్టకపోవడమే నేడు నిర్వాసితులు దిగ్బంధనానికి కారణం.

**(1)** గోదావరి ముంపు బారిన పడి నరకయాతన అనుభవిస్తున్న నిర్వాసితులను స్థానిక ప్రజల సహకారంతోనూ, ఎన్‌డిఆర్ఎఫ్ బృందాల ద్వారా వరదల్లో చిక్కుకుపోయిన వారిని బయటకు తీసుకురావాలి.

**(2)** చింతూరు, రంపచోడవరం కేంద్రాలుగా సీనియర్ ఐఎఎస్ అధికారులను పంపి ముంపు సహాయక చర్యలు చేపట్టాలి.

**(3)** కొండలపైన, ఇతర ప్రాంతాల్లో తలదాచుకున్న బాధితులకు ఎక్కడికక్కడ తాత్కాలిక మిలటరీ టెంట్‌లు సరఫరా చేయాలి. ప్రజల సహకారంతో సహాయక చర్యలు చేపట్టాలి.

**(4)** ప్రతీ కుటుంబానికి 10 లీటర్ల కిరోసిన్ వెంటనే సరఫరా చేయాలి.

**(5)** నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి.

**(6)** మంచినీరు, మందులు ఇవ్వాలి.

**(7)** మెడికల్ బృందాలను గ్రామాలకు పంపాలి.

| | | |
|---|---|---|
| **(కె.రామకృష్ణ)**<br>సిపిఐ | **(పెనుమల్లి మధు)**<br>సిపిఐ(యం) | సం/-<br>**(పి.ప్రసాద్)**<br>సిపిఐ(యంఎల్) న్యూడెమోక్రసీ |
| **(జాస్తి కిషోర్‌బాబు)**<br>సిపిఐ(యంఎల్) | సం/-<br>**(ఖాదర్ భాషా)**<br>యంసిపిఐ(యు) | సం/-<br>**(బి.బంగార్‌రావ్)**<br>సిపిఐ(యంఎల్) లిబరేషన్ |

| | | | |
|---|---|---|---|
| సం/-<br>**(చిట్టిపాటి వెంకటేశ్వర్లు)**<br>సిపిఐ(యంఎల్) న్యూడెమోక్రసీ | **(బి.ఎస్. అమర్‌నాథ్)**<br>యస్‌యుసిఐ(సి) | **(పి.వి.సుందరరామరాజు)**<br>ఫార్వర్డ్‌బ్లాక్ | **(జానకి రాములు)**<br>రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ |